సాయం కోసం .. ఎదురుచూపు

● సర్వే పేరుతో జాప్యం
● వేట నిషేధ భృతి రూ.20 వేలు చెల్లించాలి



బడివానిపేట తీరంలో వలలు, బోట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి ఏటా సముద్రంలో చేపల ఉత్పత్తి పెరగటం, గుడ్లు పిల్లలగా మారటం, పిల్లలు పెరగటం కోసం వేటను నిషేధిస్తారు. ఈ నిషేధ సమయం ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 60 రోజులు ఉంటుంది. చేపల వేట మీద ఆధారపడిన మత్స్యకారులకు భృతి అందజేస్తారు. రూ.20 వేల భృతి అందజేస్తామని కూటమి ప్రభుత్వం వెల్లడించింది. నిషేధ సమయం పూర్తయి నెల కావస్తున్నా ఇంకా ఈ భృతి మత్స్యకారులకు చేరలేదు.

అర్హులను తగ్గించే ప్రయత్నం..

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో 11 పంచాయతీల్లో మత్స్యకారులు చేపలు వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. బడివానిపేట, డి.మత్స్యలేశం, బుడగుట్లపాలెం, జీరుపాలెం, కొచ్చెర్ల, అల్లివలస, కొవ్వాడ, మెంటాడ, ఎంజీఆర్ పురం తదితర గ్రామాల్లో 1,750 మంది చేపలు వేట చేస్తున్నారు. వీరికి ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు ఇప్పటికే అందజేయావల్సి ఉంటుంది. గత కొన్నేళ్లగా అందజేస్తున్న జాబితా ఉన్నాయి. మత్స్యకార గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్లు సైతం ఉన్నారు. అయినా అర్హత సర్వే పేరుతో జాబితా జాప్యం చేస్తున్నారు. అర్హులను గుర్తించేందుకు అనేక సర్వేలు చేస్తున్నారు. అర్హులను తగ్గించుకునే ప్రయత్నం జరగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.3.50 కోట్ల వరకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో మత్స్యకార భృతికి అవసరమవుతుంది.



వేట నుంచి ఒడ్డుకు వస్తున్న మత్స్యకారులు

అర్హులందరికీ అందజేయాలి



అర్హులందరికీ మత్స్యకార భృతి అందజేయాలి. చేపలు వేట మీద ఆధారపడిన ప్రతి ఒక్కరి పేరు గ్రామ సచివాలయాల్లో ఉంది. సర్వేలు పేరుతో అర్హులను దూరం చేయకూడదు. నిషేధ సమయం ముగిసి నెల రోజులు దాటుతుంది. గత ప్రభుత్వంలో రూ.10 వేలను సకాలంలోనే అందజేవారు.

– సమరం, బడివానిపేట

తక్షణమే చర్యలు తీసుకోవాలి



వేట నిషేధం ప్రారంభమైన ఏప్రిల్ 15వ తేదీ నుంచే జాబితా గతంతో సిద్ధం చేసేవారు. నిషేధం ముగిశాఖ మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేసేవారు. ఈ ఏడాది తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రభుత్వ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– ఎం.రామారావు, డి.మత్స్యలేశం

అర్హులను గుర్తిస్తున్నాం

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హుల గుర్తింపు జరగుతుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పంపిణీ ఉంటుంది. సర్వే చేసి అర్హులను ప్రాథమికంగా గుర్తించే చర్యలు తీసుకుంటున్నాం.

– పీవీ శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



నారాయణ తిరుమలలో స్వామికి పూజలు



మొండేటివీధిలోని వేంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని వైష్ణవ దేవాలయాలలో శయన ఏకాదశి పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో స్వామిని తులసి మాలలలో అలంకరించి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. మొండేటివీధిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయం, కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో పూజలు

పరిశుభ్రతకు సహకరించాలి



కూరగాయల వ్యర్థాలను పరిశీలిస్తున్న సర్పంచ్

నరసన్నపేట: కూరగాయల, ఇతర వ్యర్థాలు రోడ్డుపైన, ఖాళీ స్థలాల్లో వేయవద్దని, పరిశుభ్రతకు సహకరించాలని సర్పంచ్ బూరల్లి శంకర్ కోరారు. స్థానిక కాలేజీ రోడ్డు, బజారు వీధుల్లో బుధవారం పంచాయతీ సిబ్బందితో కలిసి పర్యటించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యర్థాలను డబ్బాల్లో వేసి ఉంచితే పంచాయతీ సిబ్బంది వచ్చి సేకరిస్తారన్నారు. వ్యర్థాలు ఎక్కడి కక్కడ కనిపించి దుర్వాసన వస్తుండటంతో కూరగాయల వ్యాపారులకు సూచనలు చేశారు. రోడ్డుపై వ్యర్థాలు వేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పట్టణంలో జ్వరాల తీవ్రత పెరుగుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

93 మందికి నేత్ర పరీక్షలు

పోలాకి: మండల కేంద్రంలోని సత్యసాయి ఆలయం ఆవరణలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించా. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో 93 మందికి కంటి పరీక్షలు చేశారు. 32 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. డాక్టర్ నిఖిత, ఆప్తమాలిక్ ఆఫీసర్ రత్నంరాజు, క్యాంప్ మేనేజర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి కల్యాణం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాస తొలి శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో సూర్యనారాయణ స్వామి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో ప్రత్యేక సింహాసనంపై ఉంచి కల్యాణం నిర్వహించారు.

- అరసవల్లి

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతాలలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ : ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా నగరంలో పలుచోట్ల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు బుధవారం నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో 111 మంది దంపతులతో గురుస్వామి రంగాభట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 12మంది రుత్వికులు వ్రతాలు చేయించారు. కార్యక్రమంలో కొండా రాంబాబు, మల్లారీ దేవి దంపతులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ దేవత ఉత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెంలో నిర్వహిస్తున్న కొత్తమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నాయకుల ఆహ్వానం మేరకు హాజరైన ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. బంధు, మిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

ఉపాధ్యాయురాలి మృతికి సంతాపం



పద్మావతి (ఫైల్)

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ భాషోపాధ్యాయురాలు పైడి పద్మావతి (53) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకాకుళం సమీపంలోని బైరివానిపేట స్వగృహంలో బుధవారం ఉదయం గుండెపోటు రావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త బాలకృష్ణ ఆర్టీసీలో ఫార్మసిస్టుగా పని చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు చాందిని, భానుకిరణ్ ఉన్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు తదితరులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

మురుగునీరు తొలగింపు



మురుగునీరు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'రోడ్లపైకి మురుగునీరు' అనే శీర్షికన ఈ నెల 15న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నగరంలోని పుణ్యపు వీధిలో మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానిక మున్సిపల్ స్కూల్ విద్యార్థులు ప్రతి రోజూ ఇబ్బందిపడేవారు. దీంతో మురుగునీరు తొలగింపజేశారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం



సౌమ్యరాణిని అభినందిస్తున్న డాక్టర్ రామ్మోహన్. పక్కనే కోచ్‌లు



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులతో డీఎస్‌ఏ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిభకలిగిన నిరుపేద క్రీడాకారులకు సాయంతోపాటు ప్రోత్సాహం కూడా అవసరమని పీవీఎస్ రామ్మోహన్ ఫౌండేషన్స్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పీవీఎస్ రామ్మోహన్ అన్నారు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ మైదానం వేదికగా ఈ నెల 20 నుంచి జరగనున్న ఏషియన్ జూడో ఎంపిక పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన జూడో సంచలనం కడపల సౌమ్యరాణికి డాక్టర్ అభినందిస్తూ రూ.20 వేలు సాయం అందజేశారు. బుధవారం శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సౌమ్యరాణితో పాటు డీఎస్‌ఏ జూడో కోచ్ పీవీఎస్ మణికుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు కె.హరికృష్ణ, డి.లక్ష్మణరావు, ఎం.ఉమామహేశ్వరరావు, ఎస్.సింహాచలం, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదులకు సత్కారం



సీనియర్ న్యాయవాదిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో సీనియర్ న్యాయవాదులను సత్కరించి గౌరవించడం ఆనందంగా ఉందని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. బుధవారం ప్రపంచ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా సీనియర్ న్యాయవాది ఇ.ఎం.ఎస్.రావును శ్రీకాకుళంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. సమాజంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నదే న్యాయస్థానం ముఖ్య ఉద్దేశమని మెంటార్ నటుకుల మోహన్ అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధి బాడాన దేవభూషణరావు, సభ్యులు శిల్లా మణి, గుత్తు చిన్నారావు, పొడుగు చరణ్, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విన్యాసాలు చేస్తే చర్యలు తప్పవు



యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళవారం అర్ధరాత్రి కొందరు యువకులు కారుతో స్కిట్‌లు చేస్తూ అలజడి సృష్టించారు. అదే సమయంలో నైట్ బీట్ విధుల్లో ఉన్న రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు అక్కడికి చేరి యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అత్యుత్సాహం ప్రదర్శించి ఇలాంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెల్లివీధిలో అమ్మవారి పండగల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎరువుల పంపిణీ



ఎరువులను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై ఎరువులను మండల సీనియర్ నాయకులు బూరాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఇటువంటి అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. బి.భాస్కరరావు, రిటైర్డ్ వైద్యాధికారి చింత మలేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గౌరీశంకరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేషపాన్పు అవతారంలో జగన్నాథుడు



గుజరాతిపేటలో శేషపాన్పు అవతారంలో..



పొండ్రంగివీధిలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గుజరాతిపేటలో జగన్నాథ స్వామిని శేషపాన్పు అవతారంలో బుధవారం అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథుడిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం మారు రథయాత్ర సందర్భంగా స్వామి వారిని గుశనగుళ్ల నుంచి తిరిగి ఆలయానికి చేర్చే కార్యక్రమం జరుగుతుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్యామలరావు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పొండ్రంగి వీధిలో జగన్నాథస్వామిని శేషపాన్పు అవతారంలో బుధవారం అలంకరించారు. అర్చకులు ప్రదీప్‌శర్మ, ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామి దర్శించుకున్నారు. భక్తులు ఉన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి సర్వే



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట: జాతీయ కుష్టు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా ఇంటింటా సర్వేను చేపట్టాలని హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఈఓ విమలరావు అన్నారు. మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో బుధవారం కుష్టు వ్యాధి గుర్తింపుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. మనిషి చరీరంపై ప్రత్యేకమైన మచ్చలు ఉంటే వారిని గుర్తించి తగిన పరీక్షలు నిర్వహించాలని అవగాహన కల్పించారు. స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది ఎస్.కిరణ్ కుమార్, ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ స్టేషన్ తనిఖీ

నరసన్నపేట: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ కార్యాలయాన్ని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అదనపు ఎస్పీ డి.గంగాధరం బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుల విచారణను త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక సీఐ సతీష్‌కుమార్‌కు సూచించారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో జెడ్పీ సీఈఓ



ఆలయంలో సీఈఓ కుటుంబసభ్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లా పరిషత్ సీఈఓ డి.వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్యాన్న దాన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి ద్వారపు గోపాలరావు, నళిని కుటుంబ సభ్యులు బుధవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ద్వారపు అజిత్‌కుమార్, సూర్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు ద్వారపు అనురాధ పాల్గొన్నారు.

20 నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు

అరసవల్లి: ప్రఖ్యాత అరసవల్లి పుణ్యక్షేత్రంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా తత్వ ప్రచార మందిరంలో ఈ నెల 20 నుంచి 22 వరకు గురుపౌర్ణమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్లు ముద్దాడ అప్పలనాయుడు, దోర సన్యాసిరావు ఒక ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం 6 గంటల నుంచి కాకడ హారతితో ఉత్సవాలు ప్రారంభమై 21న బాబాకు క్షీరాభిషేకం, చందనోత్సవం, పుష్పాభిషేకాలు నిర్వహిస్తామని, 22న మధ్యాహ్నం హారతి అనంతరం నారాయణ సేవ (అన్నదానం)తో ఉత్సవాలు ముగుస్తాయని ప్రకటించారు. బాబా భక్తులంతా తరలిరావాలని కోరారు.

పరామర్శ..



సర్పంచ్ శారదను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్, నాయకులు

జి.సిగడాం: మండలంలోని ముషినివలస గ్రామ సర్పంచ్ చందక శారద అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ముషినివలస వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల బూత్ కమిటీ కన్వీనర్ అబోతుల జగన్నాథం, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, నాయకులు చందక సతీష్, చందక మహేష్, దమరసింగి ఆదినారాయణ, ఈసర్ల తవిటినాయుడు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఈ నెల 19వ తేదీన అత్యవసర మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జే.ఆర్.పురం, రణస్థలం, గరికిపాలెం, బావరాజుపాలెం, దన్నానపేట, ఎర్రవరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చినుకు పడితే చిత్తడే..



చిత్తడిగా చిలకపాలెం కూడలి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం కూడలి చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్డు నుంచి పొందూరు వైపు వెళ్లే ఆర్అంబీ రోడ్డు ప్రారంభంలో గోతులమయంగా మరింది. పొందూరు, రాజాం, బొబ్బిలి వైపు బస్సులు ఈ మార్గంలోనే వెళ్తున్నాయి. ఆటోలు, ఇతర వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డులకు ఇరువైపుల దుకాణాలు సైతం నిర్వహిస్తున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.